
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 16 మే 2025



• మామిడి తోటలే పేకాట కేంద్రాలు • పట్టణాల్లో అద్దె గదుల్లో
• సీసీఎస్ పోలీసులకు పట్టుబడుతున్న పేకాటరాయుళ్లు • రోడ్డున పడుతున్న కుటుంబాలు

జోరుగా మూడు ముక్కలాట



రాయికల్ మండలం మైతాపూర్‌లో పోలీసులు గుర్తించిన పేకాట స్థావరం



జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు ముక్కలాట జోరుగా సాగుతోంది. మామిడి తోటలు, వ్యవసాయ భూములు, పల్లెల శివారు ప్రాంతాలు పేకాటకు అడ్డాగా మారుతున్నాయి. కొందరు వేడుకల పేరుతో మద్యం, హుక్కా, గంజాయి మత్తులో తూలుతున్నారు. అదే సమయంలో మూడు ముక్కలాటను సైతం కొనసాగిస్తున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ వంటి పట్టణా లు, మండల కేంద్రాలకు చేరువలో ఉన్న శివారు ప్రాంతాల్లో పదులసంఖ్యలో ఇటువంటి పేకాట అడ్డాలున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట పేకాట కొనసాగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మద్యం, డ్రగ్స్ సైతం వినియోగిస్తున్నారు. దేవస్థానాల శివారు ప్రాంతాలు, పట్టణాలకు చేరువలో ఉన్న ప్రాంతాల్లో ఈ వ్యవహారం ఎక్కువగా నడుస్తోంది.

ఒక్కొక్కరుగా చేరుకుంటూ గుంపుగా..

జనవాసాలకు దూరంగా ఉండే మామిడి తోటలు, పంటపొలాలు, చెరువు గట్టులు, గోదావరి తీర ప్రాంతాలను వేదికగా చేసుకొని జూదా న్ని కొనసాగిస్తున్నారు. పేకాటకోసం ప్రత్యేక టెంటు, కుర్చీలు, టేబుళ్లు సైతం కొన్నిచోట్ల ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. పేకాట రాయుళ్ల అవసరాలకు తగ్గట్టుగా ఆహార పదార్థాలను సైతం అందిస్తున్నారు. ఇందు కొరకు ప్రత్యేక వ్యక్తులను నియమించుకుంటున్నారు. దూరం నుంచి ఎవరైనా గమనిస్తే వన భోజనం చేసుకుంటు న్నట్లు కనిపిస్తోంది. పేకాట రాయుళ్లకు భోజనం, మందును కూడా అందిస్తున్నారు. నిర్వాహకులు స్థావరం ఏర్పాటు చేసిన ప్రాంత సమాచారాన్ని పేకాట రాయుళ్లకు రహస్యంగా అందిస్తున్నారు. ఒక్కొక్కరుగా స్థావరానికి చేరుకుంటారు. ఇలా ఎవరూ గుర్తించకుండా అడ్డాలు మారుస్తూ పేకాట నిర్వహిస్తున్నారు. పేకాట స్థావరాల వద్దకు ఇతరులు ఎవరైనా వస్తే ముందస్తుగా సమాచారం ఇవ్వడానికి సెంట్రీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం స్థానిక నేతలకు తెలిసినప్పటికీ పోలీసులకు సమాచారం ఇవ్వడం లేదు. వాటిని అడ్డుకోవడానికి ప్రయ త్నించడం లేదు.

సరదాతో మొదలై వ్యసనంగా...

కొందరు సరదా కొరకు మొదలెట్టిన పేకాట వ్యసనంగా మారుతోంది. జిల్లాలో పేక మూడు ముక్కలు, ఆరు మాముళ్లగా సాగుతోంది. ఎన్నో కుటుంబాలను నాశనం చేస్తున్న పేకాట నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు ప్రయత్నం చేస్తుంటే మరో వైపు సులువుగా డబ్బులు సంపాదించాలన్న అత్యాశతో కొందరు దళారులు పేకాట స్థావరాలు ఏర్పాటు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కిందిస్థాయి అధికారులు మామూళ్ల మత్తులో పరోక్షంగా ఆటను ప్రోత్సహిస్తు న్నారు. దీంతో జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. రాజకీయ పలుకుబడి గల కందరు చోటా మోటా నాయకులు, వ్యాపారులు ఈ దందాను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు దాడులు చేసి పేకాట రాయుళ్లను పట్టుకుంటున్నా స్వాధీనం చేసుకున్న డబ్బుల్లో కొంత స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టు బడ్డ వారిలో కొందరిని అరెస్టు చూపుతూ మిగితా వారిని వదిలి వేస్తున్నారన్న విమర్శలు ఉంటున్నాయి.

రమ్మీ, మూడు ముక్కలాటలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న పేకాట శిబిరాల్లో ఎక్కువగా రమ్మీ, మూడు ముక్కలాటలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది మందితో కెనెస్టా ఆటను ఆడిస్తున్నారు. డబ్బులు పెట్టి స్థాయిని బట్టి గ్రూపులుగా విభజించి ఆట ఆడిస్తున్నారు. రూ. 1,000 మొదలుకొని రూ. 20,000 వరకు ఆటలు నిర్వహిస్తున్నారు. రమ్మీఆటను అయితే ఏడు గురితో, కెనెస్టా ఆటను తొమ్మిది మందితో నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన రూ.5వేల ఆట నిర్వహిస్తే రూ. 35 అవుతుంటాయి. నిర్వా హకుడు ఆటకు రూ. 1,000 నుంచి రూ. 2,000 వరకు కమీషన్ తీసుకుంటున్నారు. ఖర్చులు పోను రోజు రూ. 15వేల నుంచి రూ.25వేల వరకు సంపాదిస్తున్నారు. తాము తీసుకుంటున్న కమీషన్ నుంచి సంబంధిత అధికారులకు వారం, పక్షం, నెలవారీగా మాముళ్లు అందిస్తుంటారని సమాచారం. వ్యసనంగా మారిన పేకాటలో తాము పోగొట్టుకున్న డబ్బును తిరిగి సంపాదిస్తామన్న అత్యాశతో అప్పులు చేసి ఆడుతున్నారు. అప్పులు చేయడమే కాకుండా భార్య మెడల్లోని పుస్తెలతాడు అమ్మిపేకాటలో డబ్బులు కోల్పోయిన జూదరులు కూడా ఉన్నారు. కొందరు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు రోజూ జూదం ఆడేందుకు ఆసక్తి చూపుతున్నారు. పేకాట రాయుళ్లు, పొగ రాయుళ్లు, మందు బాబుల ఆగడాలతో ఘర్షణలు జరుగుతున్నాయి.

అద్దె గదుల్లో ఆట

జిల్లాలోని పలు ప్రధాన పట్టణాల్లో అద్దె గదుల్లో పేకాట ఆడుతున్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి ఆడుతుంటారు. మరి కొందరు స్నేహితుల ఇళ్లలో పేకాట ఆడుతున్నారు. పొరుగు జిల్లాలైన నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, సిరిసిల్ల తదితర ప్రాంతాల నుంచి వచ్చి పేకాట ఆడుతున్నారు. పట్టుబడి అరెస్టు అయినప్పటికీ వ్యసనం వదల కుండా మళ్లీ పేకాట ఆడుతున్నారు.

కీలకంగా సీసీఎస్ పోలీసులు

పేకాట నియంత్రించడంలో సీసీఎస్ పోలీసులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. మూడు, నాలుగు నెలలుగా...

మిగతా 8లో

గ్రంథాలయాల సిబ్బందికి వేతనాలు అందించాలి

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజోతి): చాలీచాలని వేతనాలతో, పెన్షన్ డబ్బులతో జీవితాన్ని నెట్టుకువస్తున్న గ్రంథాలయాల సిబ్బందికి, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ డబ్బులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి నెలా వేతనాలు సక్రమంగా రాక గ్రంథాలయ సంస్థ ఉద్యో గులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై గ్రంథాలయ చైర్మన్ రియాజ్‌కు ఫాక్స్ ద్వారా వినతిపత్రం సమర్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బొల్లం విజయ్, ఉపాధ్యక్షులు వెల్మల ప్రకాశ్‌రావు, విశ్వనాథం, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సత్యనారాయణ, నీలగిరి జగదీశ్వర్ రావు, కే. మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

• ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రవేత్తల సలహాలు , సూచనలను పాటించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాలరూరల్ మండలం కల్లెడ గ్రామంలో పొలాస వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, అన్నదాతల అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది ఒక మంచి కార్యక్రమని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు విజ్ఞాన కేంద్రం ను సైతం జగిత్యాలలో ఏర్పాటు ప్రతిపాదన చేయాలని, దీనికి పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మె ల్యే తెలిపారు. క్రిషి విజ్ఞాన కేంద్రం సైతం జగిత్యాలలో మంజూరు చేయడం కోసం ఎంపీ అర్వింద్‌తో కలి సి కేంద్రమంత్రులను విన్నవించినట్లు తెలిపారు. రైతులు కాలానికి అనుగుణంగా మారాలని అన్నారు. నిత్యం ఫర్టిలైజర్ ఎరువులపై ఆధారపడడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. వ్యవసాయంలో నూతన సాంకేతికత ఉపయోగం పెరిగిందని, రైతులు ఆవిధంగా ఆలోచన చేయాలన్నారు. ఈకా ర్యక్రమంలో



కల్లెడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, పాల్గొన్న వ్యవసాయ అధికారులు

పీపీటీఏయూ వైస్‌చాన్స్‌లర్ జానయ్య, ఏడీఆర్ శ్రీలత, ఏడీ సైదానాయక్, జిల్లావ్యవసాయాధికారి భాస్కర్, శ్యాం, స్వాతి, ఏడీఏ తిరుపతినాయక్, వ్యవసాయశాఖ అధికా రులు, రైతులు పాల్గొన్నారు.

గుల్లపేటలో...

జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేటలో గురువారం పొలాస వ్యవసాయకళాశాల ఆధ్వర్యంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పంటల దిగుబడి, సాగునీటి ఆదా, యూరియా వాడకం, మట్టి పరీక్ష, రసాయన మందుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పొలాస కళాశాల శాస్త్రవేత్తలు, మాజీసర్పంచ్ జక్కుల తిరుపతి, మాజీఉపసర్పంచ్ తిరుపతి, మాజీ ఎంపీటీసీ దమ్మ సురేందర్‌రెడ్డి, ఏఈఓ రమ్య, సెక్రటరీ నయిమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రక్త నిల్వలు పెంచుకుందాం

• జిల్లా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఉపేందర్

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): రక్తదాతల సహకారంతో రక్త నిల్వలను పెంచుకొని ప్రజల ఆరోగ్య పరిరక్షణ తోడ్పడుదామని జగిత్యాల జిల్లా డ్రగ్ ఇన్స్‌పెక్టర్ వి.ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో ఐఎంఏ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్త దాన శిబిరాన్ని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఉపేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో గల రక్తనిలువలను గురించి తెలుసుకోవడానికి రక్త కోష్ అనే మొబైల్ యాప్ ప్రస్తుతం అందుబాటులో ఉందని తెలిపారు. ఈయాప్ ద్వారా మన ప్రాంతంలో గల బ్లడ్ బ్యాంక్ వివరాలు, ప్రతి గ్రూప్ రక్తం నిలువ గల యూనిట్ల సంఖ్య తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. శిబిరంలో సుమారు 26 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఐఎం ఏ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి, హేమంత్ ప్రధాన కార్య దర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ ఎం మోహన్ రెడ్డి, డాక్టర్ బి సతీష్ కుమార్, డాక్టర్ బి గురువారెడ్డి, డాక్టర్ జి చంద్రశేఖర్‌గౌడ్, డాక్టర్ జి వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ మొర సుమన్, డాక్టర్ ఏ అజయ్‌రెడ్డి, బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ గీతిక పాల్గొన్నారు.



రక్తదాతలకు గుర్తింపు పత్రాన్ని అందిస్తున్న డ్రగ్ ఇన్స్‌పెక్టర్ ఉపేందర్ తదితరులు

నేడు డయల్ యువర్ డీఎం

మెట్‌పల్లిటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి బస్ డిపోలో శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ దేవరాజం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు డిపో అభివృద్ధి కోసం సమస్యలను, సలహాలను ఫోన్. 9959225927 నంబర్‌కు కాల్ చేసి సూచనలు అందించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జగిత్యాల అగ్రికల్చర్, మే 15(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగవకాశాలు కల్పించేందుకు ఈ నెల 17న జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సత్తెమ్మ తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో గల ఖాళీల భర్తీ కోసం ఈ ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని గమనించాలని కోరారు. ఇందులో ఫార్మాసిస్ట్, ట్రైనీ ఫార్మాసిస్ట్, ఫార్మసిస్ట్ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ పోస్టులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించబడుతాయన్నారు. యువతీ, యువకులు ఈ నెల 17న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలోగల ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం రూం. నెంబర్ 216 రెండవ అంతస్తులో జరిగే జాబ్‌మేళాకు ధృవపత్రాలతో హాజరు కావాలని సత్తెమ్మ కోరారు.

ఉపాధి పనుల నిర్వహణపై అధికారుల ఆగ్రహం

• సర్వే ఖర్చు రూ. 80 వేలు.. రికవరీ రూ. 38 వేలు • ఉపాధి హామీ మండల సామాజిక తనిఖీ వేదిక సభ

కథలాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకం కింద చేపట్టిన పనులపై జరిగిన సామాజిక తనికీ వేదిక సభలో మండల స్థాయి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తమైంది. డీఆర్‌డీఓ, జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి, ప్రిసైడింగ్ అధికారి మదన్‌మోహన్ మండలంలో ఉపాధి హామీ కింద జరిగిన పనులు పూర్తిగా నిర్లక్ష్యంతో చేపట్టారని మండిపడ్డారు. పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయని కారణంగా పనికి వెళ్లకున్నా కూలీలకు ఖాతాల్లో డబ్బులు పడడం, లేబర్ బడ్జెట్ తయారు చేసుకోకపోవడం, పనిప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, మొక్కలు ఎండినా పట్టించుకోని వైనంపై తీవ్ర అగ్రహం వెలిబుచ్చారు. పెగ్గెర్లలో రూ. 3.79 లక్షల పనికి సంబంధించి రికార్డులే లేవని తనిఖీలో వెలుగు చూడడం అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పనికి వచ్చిన కూలీలకు తక్కువ వేతనాలు చెల్లించడమేమిటని ప్రశ్నించారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు నుంచి జనవరి 26 గణతంత్ర దినోత్సవం దాకా గ్రామాల్లో పనుల గుర్తింపు కోసం సభలు నిర్వహించి పక్కా ప్రణాళిక రూపొందించుకో వడంలో పూర్తిగా విఫలం చెందారని మండి పడ్డారు. కనీసం క్యాష్ బుక్కులు కూడా క్షేత్రస్థాయిలో నిర్వ హించలేదని తనిఖీ బృందం గుర్తించినట్టు చెప్పారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు జీపీ ఖాతాల్లోనే మెటీరియల్ డబ్బులు జమ చేసుకుని తదనంతరం ఏజెన్సీలకు అందించాలని సూచించారు.



కథలాపూర్‌లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

• కొండను తవ్వి... ఎలుకను పట్టి..

మండలంలోని 19 గ్రామాల్లో గత ఏడాది ఉపాధి హామి పథకం కింద 264 పనులను రూ. 4.19 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ కింద 77పనులను రు.3.11 కోట్లతో చేపట్టారు. దీనికి గత వారం రోజుల నుంచి గ్రామాల్లో వలంటీర్లు పూర్తి చేసిన పనిప్రదేశాలు, కూలీల వద్దకు వెళ్లి సర్వే చేపట్టారు. ఈ సర్వేకు గాను రవాణా, స్టేషనరీ, భోజనం, సర్వేబృందానికి వేతనాలు కలిపి రూ.80 వేలు ఖర్చు చేశారు. అయితే తనిఖీల్లో కేవలం రూ. 38,109లు మాత్రమే రికవరీ చేయడంతో కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా మారిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. జిల్లా స్థాయి అధికారులు చేసిన హడావుడితోనే సమయం వృధా అయిందనే చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో అంబుడ్స్ పర్సన్ కృష్ణారెడ్డి, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ దేవేం ధర్, క్వాలిటీ కంట్రోల్ అధికారి మల్లిఖార్జున్, డీఈఈ సత్యనారాయణ, ఎంపీడీఓ శంకర్‌నాయక్ ఉన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులు

బీర్‌పూర్,మే 15(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో ఈ నెల1 నుంచుట 15 వరకు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ గురువారంతో ముగిసింది. క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు మండల విద్యాధికారి నాగభూషణం చేతుల మీదుగా మెడల్స్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గడిచిన 15 రోజులలో విద్యార్థులు క్రీడారంగంలో ఎంతగానో నైపుణ్యం సాధించారన్నారు. శిక్షణను శ్రద్ధతో నేర్చుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, బీర్‌పూర్ మాజీ సర్పంచ్ శిల్ప రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహమూర్తి పీడీలు లక్ష్మన్, అంజయ్య, సీఆర్‌పీ సురేష్, పీఈటీ రాకేష్, కరాటే మాస్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

• ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమేశ్వర్



పెగడపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు భూమేశ్వర్

పెగడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల భూమేశ్వర్ పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి మండల కేంద్రంలో మండల కార్మిక సంఘం నాయకులతో కలసి సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ను భూమేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమేశ్వర్ మాట్లాడుతూ కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు శనిగరపు ప్రవీణ్, మండల కన్వీనర్ రాచర్ల సురేష్, సీగిరి రాజ్ కుమార్, రాజేష్, బొమ్మెన శంకర్, సుదాకర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రెండు సొసైటీల్లో 1.65 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

ధర్మపురి, మే 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని ధర్మపురి, జైనా పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి 1,65,237 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయా సొసైటీల సీఈవోలు అయ్యోరు రాజేష్, బలుమూరి సాగర్‌రావు తెలిపారు. ధర్మపురి పీఏసీఎస్ పరిధిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా 1,05,000 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా మరో 40,000 క్వింటాళ్లు కొనుగోలు చేయాల్సి ఉందని సీఈవో రాజేష్ తెలిపారు. అలాగే జైనా పీఏసీఎస్ పరిధిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 60,237 కింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా మరో 40,000 క్వింటాళ్లు కొనగోలు చేయాల్సి ఉందని ఆయన సీఈవో సాగర్‌రావు తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు వేగవంతం చేసినట్లు వారు వివరించారు. అలాగే వరి ధాన్యాన్ని త్వరితగతిన రైస్‌మిల్స్‌కు తరలిస్తున్నామని వారు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తిమ్మాపూర్‌లో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న జువ్వాడి నర్సింగరావు

ధర్మపురి, మే 15 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేనిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని ఆయన అన్నారు, అవసరం అయితే అదనంగా కాంటాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయిస్తామని ఆయన తెలిపారు. తిమ్మాపూర్ పీఏసీఎస్ చైర్మన్ సాయిని సత్యనారాయణ, మండల తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఈవో జిందం ప్రభాకర్, మాజీ ధర్మకర్త సాయిని శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు హరీష్‌గౌడ్, పోడేటి దేవయ్య, బోండ్ల పోచమల్లు, కర్రె చుక్కయ్య, ఎండీ షబ్బీర్, రైతులు, నిర్వాహకులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

• సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

జగిత్యాల అగ్రికల్చర్, మే 15(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరితో పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. గత ప్రభుత్వంతో పాటు ఇప్పుడు చెల్లింపులు చేయక దాదాపు రూ.8వేల కోట్ల వరకు పెండింగ్ బకాయిలు పేరుకు పోయాయన్నారు. ప్రైవేట్ యాజమాన్యాల పరిస్థితి దిక్కుతోచని స్థితికి చేరిందని జీతభత్యాలు, మెయింటెన్స్ చార్జీలు కూడా చెల్లించలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. నాలుగేళ్లుగా బకాయిలు చెల్లించక డిగ్రీ కళాశాలలు చేతులెత్తేశాయని పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన చట్టు కనకరాజు(50) బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కనకరాజు జీవనోపాధి కోసం కొంత కాలం కిందట విదేశాలకు వెళ్లి ఆరునెలల కిందటే గ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. భార్యాపిల్లలతో నిత్యం గొడవపడేవాడు. బుధవారం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. మళ్లీ ఇంటి నుంచి బయటకు వెళ్లి మద్యం తాగి వచ్చాడు. రాత్రి 8గంటలకు గదిలోకి వెళ్లిన కనకరాజు మద్యంమత్తులో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కనకరాజు భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మలేషియాలో హబ్సీపూర్ వాసి మృతి

జగిత్యాలరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన కారం నర్సయ్య అనే గల్ఫ్ కార్మికుడు మలేషియాలో మృతిచెందినట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీకమిటీ ప్రతినిధి మంద భీంరెడ్డి తెలిపారు. నర్సయ్య 23 ఏళ్లుగా మలేషియాలో ఉంటున్నాడు. ఐదునెలలుగా ఎలాంటి సమాచారం లేకపోవడంతో కుటుంబీకులు మాజీమంత్రి జీవన్‌రెడ్డిని కలిశారు. స్పందించిన మాజీమంత్రి ఆయన ఆచూకీ కనిపెట్టాలని ఎన్ఆర్ఐ అడ్వైజరీని కోరాడు. మలేషియాలోని మార్చురీలో నర్సయ్య మృతదేహం ఉన్నట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వారు గుర్తించారు. ఎప్పుడు, ఎలా మృతిచెందాడనే వివరాలు తెలియాల్సి ఉంది.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


రాజీవ్‌గాంధీ(ఫైల్)

ఎలిగేడు, మే 15 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతోకలిసి ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో బుధవారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం జరిగింది. గోదావరిఖనిపట్టణం జైభీమ్ నగర్‌కు చెందిన ముస్కె రాజీవ్‌గాంధీ(35) స్నేహితులతోకలిసి ముప్పిరితోటలో రథోత్సవంలో పాల్గొన్నాడు. అనంతరం సరదాగా ఈత కొట్టేందుకు సాయంత్రం వ్యవసాయ బావిలోకి దిగాడు. రాజీవ్‌గాంధీకి ఈత రాకపోవడంతో బావిలో గల్లంతయ్యాడు. స్నేహితులు స్థానికులకు సమాచారం అందించడంతో బావిలో ఆచూకీకోసం వెతికారు. గురువారం పోలీసులు, పెద్దపల్లి, గోదావరిఖనికి చెందిన రెస్క్యూటీంతో బావిలో వెతుకగా మృతదేహాన్ని లభ్యమైంది. మృతుడు సింగరేణిలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడికి తల్లితోపాటు అక్క,చెల్లి ఉన్నారు. గతంలో తండ్రి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

వేములవాడ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): నీటిసంపులో పడి చిన్నారి మృత్యువాత పడిన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెందిన జిక్రా ఫాతిమా(4) అనే పాప ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యలోనే పాప మృతిచెందినట్లు వైద్యాధికారులు వెల్లడించారని తెలిసింది. ఈ సంఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు


మృతిచెందిన ప్రశాంత్ బెహారీ

రామడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని చిప్పకుర్తి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకయువకుడు దుర్మరణం చెందగా, మరోఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. సుశాంత్ బెహారీ బైక్‌పై.. మరో ఇద్దరు ప్రశాంత్ బెహారీ(21), తేకల్ శరత్‌చంద్రతో కలిసి కరీంనగర్ నుంచి గోపాల్‌రావు పేటకు వెళ్తున్నారు. అతివేగంగా అజాగ్రత్తగా బైక్ నడిపిన సుశాంత్ బెహారీ చిప్పకుర్తివద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సిమెంట్ బెంచ్‌ని ఢీకొట్టాడు. దీంతో ప్రశాంత్‌బెహారీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలు కాగా వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. శరత్‌చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ సతీష్ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యంసేవించి వాహనం నడిపినవ్యక్తికి జగిత్యాలసెకండ్‌క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కరుణాకర్ ఒకరోజు జైలుశిక్ష విధించారు. రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామానికి చెందిన అల్లెపు వెంకటనర్సయ్య(49) అతిగా మద్యం సేవించి వాహనం నడుపగా రాయికల్ ఎస్సై సుధీర్ పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారించిన జడ్జి నర్సయ్యకు ఒక రోజు జైలు శిక్ష విధించారు.

డెంగ్యూతో జాగ్రత్త



- నివారణ చర్యలపై ప్రభుత్వ ప్రచారం
- నేడు జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం

జగిత్యాల/సుభాష్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): 'దోమలు పుట్టకుండా చూసుకుందాం... దోమలు కుట్టకుండా చూద్దాం... డెంగ్యూ వ్యాధిని తరిమికొడుదాం' ఇవీ డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రభుత్వ ప్రచార స్లోగన్స్. ప్రమాదకరమైన డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ ఇటీవల ప్రభుత్వం వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టింది. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రచారం నిర్వహించడంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో డెంగ్యూ వ్యాధి నియంత్రణ, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

దోమకాటుతోనే..

డెంగ్యూకి కారణమయ్యే ఫ్లేవీ వైరస్‌లు ఆడ ఏజిస్ ఈజిప్టై దోమ కుట్టడం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. ఈ వైరస్‌లలో నాలుగు రకాలున్నాయి. ఒక రకం వైరస్‌తో ఒకసారే డెంగ్యూ వస్తుంది. ఇతర రకాల వైరస్‌లతో మరోసారి రావొచ్చు. అంటే ఒకరికి జీవితంలో గరిష్ఠంగా నాలుగు సార్లు డెంగ్యూ వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రెండో సారి, మూడోసారి మరో రకం వైరస్‌తో జ్వరం వస్తే మాత్రం చాలా తీవ్రంగా ఉంటుంది.

డెంగ్యూ జ్వరం యొక్క లక్షణాలు



లక్షణాలు ఏమిటి?

దోమ కుట్టిన తర్వాత 3 నుంచి 14 రోజుల్లోపు ఎప్పుడైనా డెంగ్యూ ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. తొలి, విషమ దశలను బట్టి లక్షణాలు కనిపిస్తాయి. తొలిదశలో హఠాత్తుగా తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కళ్ల వెనకాల నుంచి నొప్పి, కళ్లు ఎర్రగా మారడం, ఉబ్బడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాంతి, వికారం, ఆకలి మందగింపు, చర్మం మీద ఎర్రటి దద్దుర్లు, దురద వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా ఛాతీ మీద మొదలై చేతులు, కాళ్లు, ముఖానికి వ్యాపిస్తుంది. విషమ దశలో పొట్ట ఉబ్బడం, పొట్టలో నొప్పి, ఆయాసం, బీపీ పడిపోవడం, కాళ్లు చేతులు చల్లబడడం, చికాకు, మగత, చిగుళ్ల వంటి భాగాల నుంచి రక్తం కారడం, చర్మం మీద ఎర్రటి చుక్కల్లాంటి మచ్చలు ఏర్పడడం వంటివి కనిపిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే మేలు

ఇంటితోపాటు ఆవరణలో నీటి కుండీలు, డ్రమ్ములు, గోళాలు వంటి ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి. కనీసం వారానికి ఒకసారి నీరు నిలువ చేసే పాత్రలను ఖాళీ చేయాలి. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో నీటి గుంటలు లేకుండా చూడాలి. ఇంటిపై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులపైన దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి. సెప్టిక్ ట్యాంకు గొట్టం, గ్యాస్ పైప్‌లైన్ పైన పలుచని బట్ట చుట్టాలి. దీంతో దోమల నివారణ చేపట్టవచ్చు. మురికి కాలువల్లో చెత్తచెదారం తొలగించి మురుగు నీరు పారే విధంగా చూడాలి. కాలువల్లో చెత్తా చెదారం, చెట్లకొమ్మలు వేయరాదు. పనికి రాని సీసాలు, డబ్బాలు, రబ్బరు టైర్లు, వాటర్ కూలర్స్ తదితర పాత్రలపైనా నీరు నిలువ లేకుండా చూడాలి. వాటిలో నీరు నిలిచిన వారం రోజుల్లో దోమలు పెరిగే అవకాశం ఉంది. దోమ తెరలు, ఇంటి కిటికీలకు జాలీలు వాడడం, వస్త్రధారణ, దినచర్యల్లో మార్పులు, దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి. రసాయనాలతో పొగబెట్టడం, ఇళ్లలో మందులు చల్లడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రచారం చేస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి..

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, జగిత్యాల



అప్రమత్తతోనే డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చు. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకొని డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రయత్నాలు చేయాలి.

ప్లేట్ లెట్స్ లెక్కింపు

డెంగ్యూ జ్వరంలో అందరికీ ప్లేట్ లెట్లు ఎక్కించాల్సిన అవసరం ఉండదు. ప్లేట్ లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఎక్కిస్తారు. ప్లేట్ లెట్స్ 50 వేల కన్నా పడిపోతే ఆసుపత్రిలో చేర్చాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్ లెట్స్ 20 వేల కన్నా తగ్గి, రక్తస్రావం లక్షణాలు కనిపిస్తే బయట నుంచి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అదే 10 వేలకు పడిపోతే రక్తస్రావం ఉన్నా, లేకున్నా ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని సూచిస్తున్నారు.

పరీక్షలు, చికిత్స

డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికిగానీ, దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి గానీ తీసుకెళ్లాలి. తగిన వైద్య పరీక్షలు చేసుకొని చికిత్స పొందాలి. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు ఎలీసా పరీక్ష ఉత్తమమైన ప్రామాణికంగా తీసుకుంటారు. బ్రూఫెన్ వంటి నొప్పి నివారణ మందులు వాడరాదు. ద్రవ పదార్థాలు, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు ఎక్కువగా తాగాలి.

అర్ధరాత్రి ఇంట్లోకి దూరి బంగారు గొలుసు చోరీ

మానకొండూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితురాలి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామంచ పోచమ్మ(85) అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. రాత్రి ఆమె నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగుడు తలుపులు పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమెపై దాడిచేసి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. వృద్ధురాలు కేకలు వేయడంతో ఆమె నోటిని గట్టిగా ఒత్తడంతో రెండు పళ్లు ఊడిపోయాయి. గురువారం ఆమె పెద్ద కుమారుడు రామంచ మల్లయ్య ఫిర్యాదు చేయడంతో సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోపాల్‌రావుపేటలో రెండిళ్లలో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రామడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో దొంగలు తాళంవేసిన ఇళ్లలోప్రవేశించి నగదు, బంగారు, వెండిఆభరణాలను అపహరించుకువెళ్లారు. బాధితులకథనం ప్రకారం.. గోపాల్‌రావుపేటకు చెందిన నల్ల శ్రీనివాస్, ఎగుర్ల బీరయ్య ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. అయితే ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం వేములవాడకు వెళ్లారు. ఒకరి ఇల్లు తర్వాత మరో ఇంటిలో ప్రవేశించిన దొంగలు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నగదు, బంగారం చోరీ చేశారు. ఈసందర్భంగా బీరయ్య ఇంట్లో లక్ష రూపాయల నగదు, 70తులాల వెండి, అలాగే శ్రీనివాస్ ఇంట్లో రూ.60వేలనగదు, నాలుగున్నర తులాల బంగారుఆభరణాలు అపహరించినట్లు తెలిపారు. గురువారం ఉదయం వారు ఇంటికి రాగా దొంగతనం జరిగినట్లుగ్రహించి పోలీసులు సమాచారం అందించారు. దీంతో ట్రైనీఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో ఫింగర్‌ప్రింట్ నిపుణులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కాల్వశ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదిలాపూర్ గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. వారివద్ద నుంచి 1,28,780 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. రామకృష్ణాపూర్‌కు చెందిన మారేపల్లి సతీష్‌కుమార్, మంచిర్యాలకు చెందిన పుప్పాల రవి, ఖిలా వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండీ. జావీద్, రాపాని శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా తాండూరుకు చెందిన గంగాధర్, పెద్దపల్లికి చెందిన పిడుగు రమేష్‌లు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- ఆరుగురు అరెస్టు...
- రూ. 8800 స్వాధీనం

శంకరపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గద్దపాకలో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8800 నగదు స్వాధీనం చేసుకొని వారిని కేశవపట్నం పోలీసులకు అప్పగించారు. వారిపై కేశవపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో రాచర్లగొల్లపల్లికి చెందిన అభినవ్, భరత్‌లు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అభినవ్, భరత్‌లు కలిసి రాచర్లగొల్లపల్లి వైపుకు వెళుతున్న క్రమంలో బైక్, కారులు ఢీకొన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు..

తంగళ్లపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామ శివారులో పాదచారులను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సిద్దిపేట జిల్లా చెందిన సుమారు 20మంది హనుమాన్ భక్తులు కాలినడకన కొండగట్టుకు వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో సిద్దిపేట జిల్లాకు చెందిన కన్నబోయిన ప్రశాంత్, పండిళ్ల సురేష్‌తో పాటు తంగళ్లపల్లి మండలం బాలమల్లు పల్లె గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు కస్తూరి నారాయణ రెడ్డి గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సన్నవడ్లు కొనాలని రోడ్డెక్కిన రైతులు

- రైతులను దూషించిన ఆలయ చైర్మన్
- ఆగ్రహంతో చితకబాదిన రైతులు


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

పెద్దపల్లి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యం పండిస్తే బోనస్ ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో రైతులు కొంతమేర సన్న రకాలను పండించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురాగా నెల రోజులు గడిచినా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంపై రైతులు రోడ్డెక్కారు. అటుగా వెళ్తున్న ఓ ప్రజాప్రతినిధి సంఘటన స్థలానికి చేరుకోని రైతులను దూషించడంతో రైతులు అతడిపై దాడి చేశారు. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామానికి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో సన్నరకం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి-జూలపల్లి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతున్నామని నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో నిమ్మనపల్లి గ్రామం నుంచి పెద్దపల్లికి కారులో వెళ్తున్న సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి నంబులాద్రి ఆలయ చైర్మన్ ఆట్ల కుమార్ రైతులు ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకొని రైతులకు ప్రభుత్వం ఏమి తక్కువ చేసిందని ఆందోళన చేస్తున్నారని దూషించాడు. దీంతో ఆవేదన చెందిన రైతులు నిరసనను వదిలిపెట్టి ఆట్ల కుమార్‌పై దాడి చేశారు. దీంతో రైతులకు, ప్రజాప్రతినిధికి మధ్య తోపులాట జరిగింది. తోపులాటలో నిమ్మనపల్లి గ్రామానికి చెందిన రైతు ఆకుల సంపత్ చొక్కా చినిగిపోయి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రైతులను శాంతింపచేయడంతో గొడవ సద్దుమణిగింది. కొనుగోలు కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నాయకత్వం రాజకీయ పార్టీల అంతర్గత వ్యవహారం

- హరీశ్‌రావుపై సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నాయకత్వం అనేది రాజకీయ పార్టీల అంతర్గత వ్యవహారమని, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమను సంప్రదించి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్‌ను నియమించారా? అని ప్రశ్నించారు. మహేష్ కుమార్‌గౌడ్‌ను ఎందుకు నియమించారని, దళితుడికి ఎందుకు ఇవ్వలేదని తాము అడిగామా? అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేసే పార్టీ అని, ఎవరైతే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందో వారినే బీఆర్ఎస్ ఎంచుకుంటుందని అన్నారు. దళిత ముఖ్యమంత్రి అన్నది 2014కు ముందు అని, తాము అధికారంలోకి రాలేదని, విజయ రామారావును బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్‌గా నియమించామని గుర్తుచేశారు. వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ సీఎం అయితేనే మంచిది అనుకున్నామని, పార్టీతోపాటు తెలంగాణ ముక్తకంఠంతో నిర్ణయం తీసుకుందని, అందుకే దళితుడు సీఎం కాలేదని అన్నారు. కొత్తగా వచ్చిన రాష్ట్రంలో కేసీఆర్ తప్ప ఎవరు సీఎం అయినా రాష్ట్రానికి నష్టం జరిగేదని, రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రం పరిస్థితి ఏమిటో చూస్తున్నామని అన్నారు. ఖర్గే ఏఐసీసీ డమ్మీ అధ్యక్షుడని, నడిపేదంతా రాహుల్ అనిజనానికి తెలియదా? అన్నారు. సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తప్ప కాంగ్రెస్‌లో ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పగ్గాలు దళితుడికి ఇవ్వాలంటున్న రేవంత్‌రెడ్డి ఖర్గేను పీఎం చేస్తామని ఎందుకు చెప్పడం లేదని, రాహుల్‌ని పీఎం చేస్తామని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. 50 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఇప్పటి వరకు కులగణన ఎందుకు నిర్వహించలేదన్నారు. దళితులపై కాంగ్రెస్‌ది, రేవంత్‌ది మొసలి కన్నీరని, పేదవుల మీద ప్రేమ తప్ప దళితులకు పదవులిచ్చే ప్రేమ కాదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే దామోదర రాజనరసింహను లేదా వివేక్ వెంకటస్వామిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ఢిల్లీకి వెళ్లి లాబియింగ్ చేయాల్సిందేనని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడున్న పరిస్థితుల్లో మంత్రివర్గ విస్తరణచేస్తే పదవికి ఎసరు వస్తుందని భయపడుతున్నార న్నారు. బిల్లా రంగా అని తమ నేతలను సంబోధించడం ద్వారా రేవంత్ సీఎం స్థాయిని తగ్గించారని, బిల్లా రంగాల చేష్టలు రేవంత్‌వేనని అన్నారు. రేవంత్ బిల్లా రంగాల స్థాయి ఎప్పుడో దాటిపోయారని, చార్లెస్ శోభరాజ్‌ను మించిపోయారని విమర్శించారు. అంబేద్కర్‌ను ఓడించి, జగ్జీవన్‌రామ్‌ను అవమానించిన కాంగ్రెస్‌కు నీతులు చెప్పే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. దళితులకు రెండుసార్లు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. రేవంత్‌కు దళితులపై ప్రేమ ఉంటే ఓ దళితుడిని సీఎం చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారంలో రేవంత్ జోక్యం తగ్గించి పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కాంగ్రెస్ చేవెళ్ల దళిత డిక్లరేషన్ అమలుపై ఆలోచించాలన్నారు. తామంతా తమ నాయకుడు కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రఘువీర్‌సింగ్, గుంజపడుగు హరిప్రసాద్, మైకెల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలు


శేఖర్(ఫైల్)

మల్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టు సమీపంలోని జగిత్యాల మార్గంలో మారుతీ టౌన్‌షిప్ ఎదురుగా గల రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కొడిమ్యాల మండలం రాంసాగర్‌కు చెందిన అనుముల శేఖర్(32) అనే యువకుడి మృతదేహం రైల్వే ట్రాక్ పక్కన పడి ఉండడంతో కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటన స్థలం పరిశీలించారు.

- బెట్టింగ్‌లో అప్పుల పాలై..

ఆత్మహత్యకు పాల్పడిన శేఖర్ కొన్నాళ్ల క్రితం విదేశాలకు వెళ్లి రాగా గత మూడేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొనడంతో అప్పుల పాలైనట్లు తెలుస్తోంది. సుమారు రూ.15లక్షలపైన అప్పులు కావడంతో మూడు రోజుల క్రితం సింగపూర్ వెళ్లడానికి హైదరా బాద్‌లో శిక్షణకు వెలుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. గురువారం శేఖర్ మృతదేహం రైల్వే ట్రాక్ వద్ద లభించడంతో భార్య, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి


మృతిచెందిన ఆవు

సైదాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన రైతు భూతాల బాపురావుకు చెందిన పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాడి ఆవు గడ్డి మేస్తూ ట్రాన్స్ ఫార్మర్ వద్దకు పోయింది. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో విద్యుత్ వైర్లు ఆవుకు తగిలడంతో అది అక్కడిక్కడే మృతి చెందింది.

సరస్వతి నమస్తుభ్యం..


పుష్కర స్నానం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే విజయరమణారావు


పుణ్యస్నానాలాచరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యులు


సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు, నాయకులు


పుష్కరఘాట్ వద్దకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, నాయకులు










త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు

- కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభం
- పుష్కర స్నానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- తొలిరోజే పోటెత్తిన భక్తులు

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాలు గురువారం వేకువజామున ప్రారంభమయ్యాయి. కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద ఉదయం 5.40 గంటలకు పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతి పుష్కరాలను ప్రారంభించారు. తొలిరోజే పుష్కర స్నానాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు పుష్కర స్నానం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసగించారు. ఈ నెల 26 వరకు సరస్వతీ పుష్కరాలు జరుగనున్నాయి.

● ఎండను సైతం లెక్క చేయకుండా

సరస్వతి నది పుష్కరాలకు భక్తులు ఎండ సైతం లెక్క చేయకుండా తరలివచ్చారు. మధ్యాహ్నం సమయంలో కూడ పుష్కర స్నానాలు ఆచరించడానికి భక్తులు నదికి రావడంతో జన సంద్రంగా మారింది. ఉదయం భక్తుల రద్దీ ఉండగా మధ్యాహ్నం వరకూ కొనసాగింది. ఎండకు వచ్చిన భక్తులు నదిలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సేద తీరారు.

● భక్తుల సౌకర్యార్థం బస్సుల ఏర్పాటు

సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక బస్టాండ్ వద్ద ప్రైవేటు పాఠశాలల, సింగరేణి బస్సులను ఏర్పాటు చేశారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద నుంచి పుష్కర ఘాట్‌కు ప్రయాణికులను తరలించేందుకు సుమారు 30 బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బస్సులు ప్రయాణికులను పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ వద్ద దించి తిరిగి తాత్కాలిక బస్టాండ్ వద్దకు చేరుకుంటున్నాయి.

● పుష్కర ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు

పుష్కర ఘాట్ వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మహాదేవపూర్, కాళేశ్వరానికి చెందిన 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానిక ఈతగాళ్లు రెండు షిఫ్ట్‌ల్లో అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. నదిలో భక్తులు లోతుకు వెళ్లకుండా మరో బృందం గస్తీ తిరుగుతూ భక్తులను అప్రమత్తం చేస్తుంది.

● ఫొటోల కోసం క్యూ..

పుష్కరాల్లో భాగంగా సరస్వతి మాత విగ్రహం సమీపంలో, టెంట్ సిటీ, ఇతరాత్ర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దేవుడి విగ్రహాల వద్ద ఫొటోలు దిగేందుకు భక్తులు క్యూ కట్టారు.

● నేడు ఉపముఖ్యమంత్రి రాక

సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం కాళేశ్వరానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నారు. ఉదయం కాళేశ్వరం చేరుకుని సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారు.

● అందుబాటులో ఫైర్ వాహనాలు

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచారు. నాలుగు ఫైర్ వాహనాలు, 2 ఓపీఎమ్ బోట్లు, 40 మంది సిబ్బంది, 2 రిమోట్ కంట్రోల్ బోట్లు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి. హెలీప్యాడ్, సరస్వతీ పుష్కర ఘాట్, టెంట్‌సిటీ, టెంపుల్ వద్ద ఈ ఫైర్ ఇంజన్ వాహనాలు, అగ్నిమాపకశాఖ యంత్రాంగం అందుబాటులో ఉంటుంది.

● సీఎం రాకతో దర్శనాల నిలిపివేత

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో భక్తుల దర్శనాలను అధికారులు నిలిపివేశారు. ముఖ్యమంత్రి తొలుత పుష్కర ఘాట్‌ను ప్రారంభించి న అనంతరం ఆలయానికి చేరుకుని మహాదేవుడికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నా లుగు గంటల పా టు దర్శనాలను నిలిపివేశారు. దాంతో వివిధ ప్రాం తాల నుంచి వచ్చిన భక్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

అనాథ యువతి వివాహానికి కలెక్టరే పెళ్లి పెద్ద

● జిల్లా అధికారుల పేర్లతో వివాహ ఆహ్వాన పత్రిక

పెద్దపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): అనాథ యువతి వివాహానికి కలెక్టరే పెళ్లి పెద్దగా మారాడు... వివాహ ఆహ్వాన ప్రతికలో ఆహ్వానించు వారిలో అధికారికంగా కలెక్టర్‌తోపాటు జిల్లా పాలన యంత్రాంగం మొత్తం ఆహ్వానించిన సంఘటన పెద్దపల్లి జిల్లా రామగుండంలో జరిగింది. రామగుండానికి చెందిన తబిత అనాథ ఆశ్రమంలో తల్లిదండ్రులను కోల్పోయిన మానస 16ఏళ్లుగా చెల్లెలుతో కలిసి ఆశ్రయం పొందుతున్నది. ఆమెకు జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన రాజేశ్‌తో వివాహం నిశ్చియమైంది. యువతి వివాహానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌లు పెళ్లిపెద్దగా ఉండేందుకు అంగీకరించారు. ఆడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) జే అరుణశ్రీ, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డీ వేణుగోపాల్ ఆశీస్సుల పేర పెళ్లి ఆహ్వాన ప్రతికలను పంపిణీ చేశారు.

ఈనెల 21న ఉదయం 11.05గంటలకు పెద్దపల్లి జిల్లా కేంద్రం కలెక్టరేట్ సమీపంలోని వేంకటేశ్వర కళ్యాణ మండపంలో వీరి వివాహం జరుగనున్నది. అనాథ యువతి వివాహానికి కలెక్టర్, జిల్లా పాలన ్రయంతాంగమే పెళ్లి పెద్దలుగా అండగా మారడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



పెళ్లి పెద్దగా కలెక్టర్ పేరుతో పెళ్లి ఆహ్వాన పత్రిక

ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల కబడ్డీ టోర్నమెంట్

భీమదేవరపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌జిల్లాల కబడ్డీ క్రీడోత్సవాలను ఈనెల23,24,25వ తేదీల్లో భీమదేవరపల్లి మండలంలోని గాంధీనగర్ గ్రామంలో తెలంగాణ పొదుపుసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. యువత డ్రగ్స్‌కు, ఆన్‌లైన్ గేమ్, మద్యానికిబానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో యువతను క్రీడల వైపు మళ్లించి నూతన ఉత్తేజాన్నినింపాలనే ఉద్దేశ్యంతో గాంధీనగర్ అంబేద్కర్ పొదుపుసంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌జిల్లాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడాపోటీలకు సంబంధించి గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల23,24,25వ తేదీల్లో జరిగే ఈక్రీడాపోటీల్లో గెలుపొందిన మొదటిజట్టుకు రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10వేలు, నాల్గో బహుమతి రూ.5వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు, అతిథులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

మల్టీజోన్ - 1 పరిధిలో తహసీల్దార్ల బదిలీలు

- జగిత్యాల నుంచి ఇతర జిల్లాలకు నలుగురు
- ఇతర జిల్లాల నుంచి జగిత్యాలకు ముగ్గురు కేటాయింపు

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): మల్టీజోన్-1 పరిధిలోని పలువురు తహసీల్దార్లను బదిలీచేస్తూ గురువారం ల్యాండ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల నుంచి నలుగురు తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీచేయగా, ఇతర జిల్లాల నుంచి జగిత్యాలజిల్లాకు ముగ్గురు తహసీల్దార్లను కేటాయించారు. ఇందులో జగిత్యాల కలెక్టరేట్‌లోని సీసెక్షన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న తహసీల్దార్ విశ్వంబర్ నిర్మల్ జిల్లాకు, బీర్‌పూర్ తహసీల్దార్ ఎంకే ముజాబొద్దీన్ నిజామాబాద్ జిల్లాకు, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ప్రసాద్ నిజామాబాద్ జిల్లాకు, మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అదే విధంగా కరీంనగర్‌జిల్లా నుంచి తహసీల్దార్ రాజేశ్, నిజామాబాద్‌జిల్లా నుంచి తహసీల్దార్ నాగార్జున, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లానుంచి తహసీల్దార్ ఉదయ్ కుమార్‌ను జగిత్యాల జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.


సంట్రెడ్డి బావి వద్ద జన సందడి

సంట్రెడ్డి బావే పెద్దపల్లి స్విమ్మింగ్ పూల్

● వేసవి సెలవుల్లో రోజంతా రద్దీ

పెద్దపల్లిటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంట్రెడ్డి బావి స్విమ్మింగ్ పూల్‌గా మారింది. వేసవి సెలవులు కావడంతో పిల్లలు, పెద్దలు, విద్యార్థులతో కిటకిటలాడుతోంది. స్విమ్మింగ్‌కు మిచ్చిన వ్యాయామం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. బంధంపల్లి గ్రామ శివారులో పెద్దపల్లికి మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో సంట్రెడ్డి బావి ఉంది. కాలాలతో సంబంధం లేకుండా నిత్యం ఉదయం వేళ ఈత కొడుతుంటారు. ఉదయం ఐదు గంటలకే ఈత కొట్టేందుకు బావి వద్దకు వస్తారు. వేసవి సెలవుల్లో పిల్లలకు బావి వద్ద ఈత నేర్పిస్తున్నారు. ట్యూబ్‌లు, వాటర్ క్యాన్లతో పిల్లలకు అలవాటు చేస్తున్నారు. పలువురు వృద్ధులు సైతం ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ బావి వ్యవసాయానికి నీరందించడం వల్ల ఎప్పటికప్పుడు నీరు శుభ్రంగా ఉంటుంది. పంటలు లేని సమయంలో రెండు మూడు రోజుకొకసారి నీరు ఖాళీ చేయించి నీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుద్ధి చేస్తారు.రెగ్యులర్ ఈతకు వచ్చే వారు వాట్సప్ గ్రూప్ తయారు చేసికొని సమాచారం ఇచ్చుకుంటున్నారు.

ఈత వల్ల లాభాలు

క్రమం తప్పకుండా ఈత కొట్టడం వల్ల బరువు తగ్గించుకోవచ్చు. శారీరక శక్తి పెరగడం, అన్ని కండరాలకు వ్యాయమం జరిగి మోకాళ్ళ నొప్పులు రాకుండా ఉండడం, గుండెకు సమస్యలను రాకుండా ఉపయోగపడుతుంది. నిత్యం 30 నిమిషాల నుంచి గంట ఈత కొడితే ఆరోగ్యంగా ఉండవచ్చు.

బరువు తగ్గిన..

: ఠాగూర్ రాంసింగ్



నేను ఎనిమిదేళ్ళగా ఇదే బావిలో ఈత కొడుతున్నాను. 120 కేజీల బరువు ఉన్నవాన్ని ఇప్పుడు 90 పైచిలుకు బరువు తగ్గాను. ఏ కాలంలోనైన ఈత కొడుతుంటా.

రోజుకు గంట స్విమింగ్ చేస్తా: రాజు



రోజుకు గంట స్విమ్మింగ్ చేస్తా. ఈతతో మంచి ఆరోగ్యంగా ఉన్నాను. రోజంతా హుషారుగా ఉంటుంది. ఈతకు రాని రోజు బద్దకంగా అనిపిస్తుంది.

కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలి

● ప్రజా సంఘాలు, సింగరేణి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఖనిలో శాంతి ర్యాలీ

కళ్యాణ్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని, ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతలో అమలు చేస్తున్న కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలని కోరుతూ ప్రజాసంఘాలు, సింగరేణి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖనిలో ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గోదావరిఖని చౌరస్తా నుంచి రీగల్ షూ మార్ట్ సెంటర్, లక్ష్మీనగర్ కూడళ్ల మీదుగా చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం 2021 జనవరి 1 నుంచి ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌తో ఇప్పటి వరకు 510మంది ఆదివాసీలు, మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లు, దాడులలో హత్యకు గురయ్యారన్నారు. కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలనే డిమాండ్ మేరకు శాంతి చర్చలకు సిద్ధమని, ఆరు నెలల వరకు కాల్పుల విరమణ పాటిస్తున్నామని మావోయిస్టులు ప్రకటించారన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ కూడా శాంతి చర్చల జరగాలని కేంద్రానికి లేఖలు రాస్తామన్నారు. వామపక్షాలు కొన్ని నెలలుగా శాంతి చర్చలు జరగాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించలేదని, దేశవ్యాప్తంగా శాంతి చర్చలకు వస్తున్న ప్రజల ప్రజాస్వామిక డిమాండ్ మేరకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలన్నారు. ఆదివాసీల పోరాట సంఘ ఐక్యవేదిక నాయకులు ముడిమడుగుల మల్లయ్య, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉప్పులేటి పర్వతాలు, గూడూరు లవన్‌కుమార్, రత్నకుమార్, వేల్పుల కుమారస్వామి, ఎస్ సమ్మక్క, ఎస్‌కే షైముదా, లలిత, మహమ్మదీన్, రహీం, దుర్గం నగేష్, సురేష్, యాదయ్య, పాల్గొన్నారు.


ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు

బర్త్‌డే పార్టీలో వివాదం

- ముగ్గురు యువకులకు కత్తి పోట్లు
- ఒకరి పరిస్థితి విషమం

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని లింగంపేట చెరువు వద్ద గురువారం ఓ బర్త్‌డే పార్టీలో జరిగిన వివాదం కత్తి పోట్లకు దారి తీసింది. అంతర్గాం గ్రామానికి చెందిన అరవింద్, వంశీ, గంగాధర్‌పై అదేగ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడిచేశారు. గాయాలపాలైన యువకు లను జగిత్యాల ప్రధానాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కత్తిపోట్లకు గురైన యువకులలో గంగాధర్ అనే యువకునికి 25 కన్నా ఎక్కువ చోట్ల కత్తి పోట్లు పడడడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


యువకులకు చికిత్స చేస్తున్న వైద్యులు

హమాలీల షెడ్డు దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేటలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హమాలీ షెడ్డుకు నిప్పంటించారు. షెడ్డు పూర్తిగా కాలిపోయింది. ఈ విషయంపై హమాలీ కార్మికుల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. గురువారం మండలు అంటుకొని దగ్ధమైన షెడ్డును మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పరిశీలించి నిర్మాణానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌చైర్మన్ రాముడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీఎంపీటీసీలు పోశాల సదానందంగౌడ్, మొగిలి సదానందం, హమాలీ కార్మికులు ఉన్నారు.


దగ్ధమైన షెడ్డును పరిశీలిస్తున్న సారయ్యగౌడ్

జోరుగా మూడు ముక్కలాట

(5వ పేజీ తరువాయి)

పట్టుపడుతున్న పేకాట రాయుళ్ల ఘటనలను పరిశీలిస్తే సీసీఎస్ పోలీసులు పట్టుకున్నవే ఎక్కువగా ఉంటున్నాయి. స్థానిక పోలీసులకు వివిధ బాధ్యతలు ఉండడం ఒక్క కారణమైతే, పేకాట రాయుళ్లు, నిర్వహణదారులతో సత్సంబంధాలు కలిగి ఉండి చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడం వల్ల సీసీఎస్ పోలీసులు దృష్టి సారించాల్సి వస్తోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. సీసీఎస్ పోలీసులకు వచ్చే సమాచారం స్థానిక పోలీసులకు ఎందుకు రావడం లేదు. ఒక వేళా వచ్చినా పట్టించుకోవడం లేదా...అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసులు మరింత ఎక్కువ దృష్టి సారిస్తే పేకాటను నియంత్రించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

పేకాట నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు

- రఘు చందర్, డీఎస్పీ, జగిత్యాల



పేకాట ఆడే వారితో పాటు ఆడించే వారిని సహించబోము. ఎక్కడ పేకాట ఆడినా పోలీసులకు సమాచారం అందిస్తే నిందితులను పట్టుకొని కోర్టుకు అప్పగిస్తాం. కొంతమంది పేకాట రాయుళ్లను ఆహ్వానించి స్థావరాలను నిర్వహిస్తున్నారు, అలాంటి వారిని ఉపేక్షించం. ప్రజలు పేకాట సమాచారాన్ని వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు గానీ, పోలీసు అధికారులకు, డయల్ 100కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

ఏఆర్ ఎస్సైని అభినందించిన ఎస్పీ



ఏఆర్ఎస్సైని అభినందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన జాదవ్ గోకుల్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం అభినందించారు. ఏఆర్ఎస్సైగా పదోన్నతి పొందిన జాదవ్ గోకుల్ గురువారం ఎస్పీ అశోక్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలవగా ఆయనకు ఏఆర్ఎస్సై పదోన్నతి చిహ్నం స్టార్‌ను అలంకరించారు. ప్రజలలో పోలీసుల పట్ల గౌరవాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బీమ్‌రావు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

రాయికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన గుర్రం వెంకటనర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దుబాయ్ వారధి సంఘం సభ్యులు గురువారం వారి కుటుంబానికి రూ.18,500 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దశమంతు వెంకటేశ్వర్లు, వాసరి రవి, మాజీ ఉప సర్పంచ్ ఆర్మూరి నరేందర్, దుబాయ్ వారధి సభ్యులు పల్లికొండ రాజు, గోపి, నరేష్, దుబాయ్ వారధి సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

బీర్‌పూర్,మే 15(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో గురువారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన వెన్న లతకు 30 వేలు, పాముల అక్షయ్‌కి 21వేలు రూపా యల విలువ గల చెక్కులను జిల్లా కాంగ్రెస్ నాయకులు గుడిసె జితేందర్ యాదవ్ అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పూదూరి రమేష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

కోరుట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రీ బ్యాంక్ అధికారుల ఆధ్వర్యంలో బ్యాంక్ ఖాతాదారుడైన శివరాత్రి సాగర్ కుటుంబ సభ్యులకు గురువారం రూ. 1లక్ష విలువ గల చెక్కు అందించారు. శివరాత్రి సాగర్ ప్రమాదవశాత్తూ మరణించంగా గాయత్రి బ్యాంక్‌లో నిర్భయ సేవింగ్ ఖాతాదారుగా ఉన్నాడు. దీంతో అతని కుటుంబానికి రూ. 1 లక్ష బీమా చెక్కును బ్రాంచ్ మేనేజర్ రోహిత్ ఆధ్వర్యంలో కోరుట్ల ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండి ఫారూక్ బీమా చెక్కును అందజేశారు.

'మృతదేహాన్ని ఇండియా తీసుకురావడానికి కృషి చేస్తా'

జగిత్యాలరూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హబ్సీపూర్ గ్రామానికి చెందిన కారం నర్సయ్య మలేషియాలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే కల్లెడ గ్రామానికి చెందిన గాజంగి రంజిత్‌తో ఫోన్‌లో మాట్లాడి మృతుడి వివరాలను సేకరించారు. మలేషియా రాయబార కార్యాలయంతో మాట్లాడి మృతదేహాన్ని ఇండియాకు తీసుకురావడానికి కృషిచేస్తానని తెలిపారు.నాయకులు ముస్కు నారాయణరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, గడ్డంనారాయణరెడ్డి ఉన్నారు.

పూర్తి వేతనం ఇప్పించాలని వినతి

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 20 వేల జీతం చెల్లించాల్సి ఉండగా తమకు 16 వేలు మాత్రమే చెల్లించారని జగిత్యాల జిల్లా స్వచ్ఛ భారత్ ఔట్ సోర్సింగ్ డ్రైవర్‌లు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తమ సమస్యను పరిష్కరించి తమకు పూర్తి జీతం చెల్లించాలని కోరారు.

డ్రైనేజీ పూడికతీత పనుల పరిశీలన

మెట్‌పల్లిటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలం నేపథ్యంలో చేపట్టిన పట్టణంలోని మెయిన్ డ్రైనేజ్ పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ మోహన్ గురువారం పరిశీలించారు. జేసీబీ ద్వారా పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జ్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఏబీవైఎం అండ

మల్లాపూర్, మే, 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన మాదం నాగరాజు కుటుంబానికి అఖిల భారత యాదవ మహాసభ అండగా ఉంటుందని జిల్లా ఉపాధ్యక్షుడు ధనరేకుల సంతోష్‌యాదవ్ అన్నారు. గురువారం గ్రామంలోని బాధితుడి ఇంటికి స్థానిక నాయకులతో కలిసి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా సుఖ్‌దేవ్ థాపర్ జయంతి

కథలాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సుఖ్‌దేవ్ థాపర్ 118వ జయంతి గురువారం మండలంలోని సిరికొండలో బీజేపీ శ్రేణులు, యువకులు ఘనంగా నిర్వహించారు. సుఖ్‌దేవ్, రాజగురు, భగత్‌సింగ్‌లతో కలిసి బ్రిటిష్ సామ్రాజ్యంపై భారత స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారని పేర్కొన్నారు. కాశోజి ప్రతాప్, గాంధారి శ్రీనివాస్, కాశోజి ప్రశాంత్, అల్లె బాను, అశోక్, గణేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం

కథలాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన దుంపెటకు చెందిన తీగల మౌనికను గురువారం గ్రామస్థులు శాలువాతో సన్మానించారు. అత్యధిక మార్కులు సాధించిన నక్క రుపెందర్, తునికి సన్నికుమార్, పిట్టల చరణ్‌ను సన్మానించారు. మాజీ సర్పంచ్ జెల్ల వేణు, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల సంతోష్ ఉన్నారు.

ఫుట్‌పాత్‌లు ఇలా.. నడిచేది ఎలా?

- రోడ్డు పైనే వ్యాపార సామగ్రి, వాహనాల పార్కింగ్
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు, పోలీసులు



మెట్‌పల్లిలో ఫుట్‌పాత్‌పై నిలిపిన వాహనాలు



ఫుట్‌పాత్‌లపై వ్యాపార బోర్డులు, వివిధ సామగ్రి పెట్టిన వ్యాపారస్తులు

మెట్‌పల్లిటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులు, పోలీసుల నిర్లక్ష్యంతో పట్టణంలో వ్యాపారులు ఆడిందే ఆట పడిందే పాటగా మారింది. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను వ్యాపారస్తులు ఆక్రమిస్తున్నా మున్సిపల్ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజల కోసం ప్రభుత్వం కోట్లది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న ఫుట్‌పాత్‌లు వ్యాపారస్తుల విక్రయ కేంద్రాలుగా మారుతున్నాయి. దీంతో పట్టణంలో రద్దీ సమస్య తీవ్రంగా పెరిగింది. మున్సిపల్ అధికారులకు అప్పుడప్పుడు జరిమానాలు విధించి మళ్లీ మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చిన్న చిన్న పండ్ల వ్యాపారులకు జరిమానాలు విధించి పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తూ రోడ్లపై వ్యాపార బోర్డులు, ప్లాస్టిక్ సామగ్రి, కిరణసామగ్రి, మెటల్ మర్చంట్, ఆటో మొబైల్ వ్యాపారులతో పాటు ఆటో కన్సల్టెంట్ వ్యాపారులు కార్లు, మోటర్ సైకిల్ వ్యాపారుస్తులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణంలో ప్రధానంగా కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్, డిపో, వెల్లుల రోడ్డు, మార్కెట్ రోడ్డులో ప్రజలు కాలినడక ప్రయాణం చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి నిజామాబాద్, నిర్మల్, సిరిసిల్ల జిల్లాలతో పాటు వివిధ జిల్లాల నుంచి వ్యాపారాలకు నిత్యం ఇక్కడికి వస్తుంటారు. వ్యాపారులు ఫుట్‌పాత్‌ను కబ్జా చేయడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు. మున్సిపల్ అధికారులు, పోలీస్‌లు స్పందించి పట్టణంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు

-టి. మోహన్, మున్సిపల్ కమిషనర్

ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీస్‌ల సహకారంతో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారలు చేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించడంతో పాటు వాటిని తొలగించి ఫుట్‌పాత్‌లను పునరుద్ధరిస్తాం.

వైభవంగా శ్రీరాముని శోభాయాత్ర

కొడిమ్యాల, మే 15(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న జరుగనున్న హన్మాన్ జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలో హన్మాన్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాత్రి హన్మాన్ దీక్షాపరులు శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. వాగు ఒడ్డున ఉన్న పురాతన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీరాముని చిత్రపటాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తిశ్రద్ధలతో భజన చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి భాస్కర్, హన్మాన్ దీక్షాపరులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు చిరుతల రామాయణ నాటక ప్రదర్శన

కొడిమ్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ గ్రామంలోన హన్మాన్ ఆలయం వద్ద ఈ నెల 16న శుక్రవారం నుంచి 18 ఆదివారం వరకు నల్లగొండలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి కళామండలి వారి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంపతిని వెదజల్లే చిరుతల రామాయణ నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కళామండలి వారు తెలిపారు. మూడు రోజులు రాత్రి 8గంటల 30 నిమిషాల నుంచి 12గంటల 30 నిమిషాల వరకు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. నాటకంలోని పాత్రదారులు 20 రోజులుగా రిహార్సల్ చేస్తున్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నల్లగొండ నర్సింహ స్వామి కళామండలి వారు కోరారు.

అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే సన్మానం

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా విభాగంలో డాక్టరేట్ పొందిన కాయితి శంకర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం సన్మానించారు. గత నెల 27న మహారాష్ట్రలోని నాసిక్‌లో సామాజిక సేవా విభాగంలో కాయితి శంకర్‌కు యూనివర్సిటీ అధికారులు అవార్డు అందించారు. శంకర్ గురువారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా శంకర్‌ను అభినందించిన ఎమ్మెల్యే సమాజంలో పేద వర్గాలకు సేవ చేయడం ద్వారా డాక్టరేట్ పొందడం గర్వకారణమని కొనియాడారు.

దాతల సహకారంతో లైబ్రరీలో మధ్యాహ్న భోజనం

జగిత్యాల అర్బన్, మే (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతీ, యువకులకు దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సామ ఉమాపతి కుమారుడు సామ అభినయ్ అమెరికాలో స్థిరపడగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి గ్రంథాలయానికి వచ్చే యువతీ, యువకులు మధ్యాహ్న భోజనానికి పడుతున్న అవస్థలు తెలుసుకుని అమెరికాలోని అతని స్నేహితుల సహకారంతో మూడు నెలల పాటు రోజూ వంద మందికి పైగా భోజన వసతి కల్పించేందుకు నిధులు సమకూర్చారు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్న కోటగిరి శ్రవణ్‌కుమార్ కుమారుడు కోటగిరి రంజిత్ గ్రంథాలయంలో భోజనవసతి ఏర్పాటుకు రూ. 75 వేలు అందించినట్లు సామ ఉమాపతి తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ అరవవెల్లి రాజేశ్వర్, రేగొండ సతీష్, పాల్తెపు భూమేశ్వర్, అరవవెల్లి ఆనంద్, గ్రంథపాలకురాలు శకుంతల పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, మే 15(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈబీసీ, వికలాంగులు, మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. మార్చి 2025లో 10వ తరగతిలో 7.0 జీపీఏ ఆపైన గ్రేడ్ పొందిన 400 మార్కులపైన వచ్చిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలో చదివే డేస్కాలర్ విద్యార్థులు, ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు, బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు 10వ తరగతి పాస్ మెమో, కుల, ఆదాయ సర్టిఫికెట్, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు నెంబర్, రేషన్‌కార్డు నెంబర్ వివరాలు, 4నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లలో చదివే విద్యార్థులు సంబంధిత హాస్టల్ సంక్షేమ అధికారిచే 3 సంవత్సరాలకు సంబంధించిన బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకొని అట్టి దానిపై సంక్షేమ అధికారిచే ధ్రువీకరించి జతపర్చాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఈ పాస్ నందు దరఖాస్తు చేసుకునేప్పుడు విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో మూడు కళాశాలలు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత ఈ పాస్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల ఎంపిక ఆటోమేటిక్‌గా జరుగుతుందని, కళాశాల కూడా అలాట్ మెంట్ అవుతుందనిఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

మేకలు, గొర్రెల దొంగల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

మల్యాల, మే 15(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల నుంచి జగిత్యాల, చుట్టు పక్కల మండలాల్లో మేకలు, గొర్రెల చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసినట్లు మల్యాల సీఐ నీలం రవి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాలకు చెందిన మద్దవేని అనిల్, మహమ్మద్ మోసీన్, వెంకటేశ్‌లు ద్విచక్రవాహనం, ఆటోలో రాత్రి సమయాల్లో గ్రామాల్లో తిరుగుతూ శివారు ప్రాంతాల్లో గల షెడ్ల నుంచి మేకలు, గొర్రెలను దొంగిలిస్తూ కొన్నింటిని అమ్ముకుంటూ, మరి కొన్నింటి మాంసం విక్రయిస్తూ జల్సాలు చేసుకునే వారు. ఈ క్రమంలో గత కొన్ని రోజుల క్రితం మల్యాల మండలం మద్దుట్ల శివారు నుంచి మేకలు, గొర్రెలను, ఓగులపూర్ శివారు నుంచి గొర్రెలను ఎత్తుకెళ్లారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా గురువారం మల్యాల సింగిల్‌విండో కార్యాలయం వద్ద ఎస్సై నరేశ్ కుమార్, పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనం, ఆటోలో రెండు మేకలు, రెండు గొర్రెలు కనిపించడంతో ఆటోలోని ఇద్దరు, ద్విచక్రవాహనంపై గల వ్యక్తిని విచారించారు. దీంతో తీగ లాగితే డొంక కదిలినట్లు జిల్లాలో పలు ప్రాంతాల్లో గత నాలుగు నెలల్లో ఆ ముగ్గురు పాల్పడిన చోరీలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలోని కొడిమ్యాల మండలం చెప్యాలలో హీరోహోండా ఫ్యాషన్ ప్లస్ వాహనం, బుగ్గారం మండల కేంద్రం, పెగడపల్లి మండల కేంద్రం శివారులో గొర్లు, మేకలు దొంగతనం చేసి ఆటోలో తరలించినట్లు సీఐ, ఎస్సై తెలిపారు. పట్టుబడిన నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు.

ప్రభాదేవికి డాక్టరేట్



దాసరి ప్రభాదేవి

కోరుట్ల రూరల్, మే 15 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన దాసరి ప్రభాదేవి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించినట్లు గ్రామస్థులు గురువారం తెలిపారు. ప్రభాదేవి కళాశాల ప్రొఫెసర్ వీబీ నరసింహ మార్గదర్శకంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇండిటిటీ ఆఫ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్ ఇన్ పబ్లిక్ క్లౌడ్ ఫ్రేమ్ వర్క్స్ అనే అశంలో పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనతో ఉస్మానియా యూనివర్శిటీ వారు ప్రభాదేవికి డాక్టరేట్ ప్రకటించారు. ప్రభాదేవి భర్త దాసరి నారాయణ, వారి బంధవు ఒకరు ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పొందగా వారి ప్రభావంతో ప్రభాదేవి పరిశోధనలు చేశారు.

నేడు సంకష్టహర చతుర్థి

ధర్మపురి, మే 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గల హేరంబ గణపతి ఆలయంలో ఈ నెల 16న సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

మల్లాపూర్, మే, 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకమైన ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య రైతులు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లావణ్య అన్నారు. గురువారం మండలంలోని ముత్యంపేట గ్రామంలో విశిష్ట గుర్తింపు ప్రక్రియను పరిశీలించారు. అధికారులకు వివరాలు అందిస్తే 11 అంకెలతో కూడిన రైతు విశిష్ట సంఖ్య అందజేస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అనిల్, రైతులు దౌడే తిరుపతి, వాకిటి రంజిత్, రాజం ఉన్నారు.

ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్టు చేయుత

మెట్‌పల్లిటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చావిడి ఏరియాలో నివసిస్తున్న బేతం హరీష్, మెట్టు రాజ్యం ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పరామర్శించి వారికి చేయుత అందించారు. ఇరువురి కుటుంబ సభ్యులకు నిత్యావసర వస్తువులతో పాటు 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సురిగి శ్రీనివాస్ గౌడ్, కంబ సురేష్, మణిదీప్ ఉన్నారు.

ఉపకార వేతనానికి ఎంపిక

రాయికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొడ్డుపల్లి రక్షిత శ్రీ మేధ చారిటబుల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. ఆరు సంవత్సరాల ఉచిత విద్యాబోధనతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తారని ప్రధానోపాధ్యాయురాలు ఉమ్మెంతల వెంకటరమణి తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



జగ్గాసాగర్‌లో వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లి రూరల్, మే, 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గాసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిసాయి. వారం రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిత్యహోమం, బలిహరణం వంటి కార్యక్రమాల అనంతరం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథాన్ని రంగురంగుల దీపాలతో అత్యంత సుందరంగా తయారు చేశారు. ఉత్సవ మూర్తులను డప్పు చప్పుళ్ల మధ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో ఉంచి గోవిందా నామస్మరణతో భక్తులు రథం లాగుతూ ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు. చివరి రోజైన గురువారం ఆలయంలోని స్వామి వారికి పురోహితులు వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం చక్రతీర్థం, నాగవెల్లి పుష్పయాగం, ఏకాంత సేవ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అభయాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం



ఆంజనేయ స్వామి

కోరుట్ల రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూర్ గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయ పదో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నారంబట్ల హన్మండ్లు శర్మ, బరద్వాజ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో ఉత్సవ దాతలుగా గండ్ర కేశవరావు - రజితా రాణి దంపతులు వ్యవహరించంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ప్రత్యేక పూజలలో బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ చిటినేని రఘు, సురభి నవీన్ రావు, రుద్రా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్యలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు కోటగిరి రాం, శేకర్, మల్లయ్య, కిషన్, రాకేష్, భూమయ్య, కిషన్, సల్ల మధు, శ్రీజ, శైలజ, జగన్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలం యాలు విజ్ఞాన భాండాగారాలు అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల జిల్లా గ్రథాలయం, గాంధీనగర్‌లోని గ్రంథాలయం అభివృద్ధికి భూమిపూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ. 35 లక్షలతో రాయికల్ పట్టణంలో, సారంగాపూర్, చల్‌గల్‌లో లైబ్రరీలను ఏర్పాటు చేశామన్నారు. కోటి రూపాయలతో జగిత్యాల పట్టణంలో కేంద్ర గ్రంథాలయం నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌లు అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డీఈ నాగేశ్వర్, ఏఈ శరణ్, నాయకులు బాలె శంకర్, బద్దం జగన్మోహన్‌రెడ్డి, పంబాల రాంకుమార్, ముస్కు నారాయణ రెడ్డి, బొడ్ల జగదీష్, చెట్‌పెల్లి సుధాకర్, కూతురు రాజేశ్, పిట్ట ధర్మరాజు, కొలగాని సత్యం పాల్గొన్నారు.

అసౌకర్యాలకు నిలయం రత్నాలమడుగు గోదావరి తీరం



నిరుపయోగంగా వాటర్ ట్యాంక్



రత్నాలమడుగు వద్ద గోదావరి తీరం

ఇబ్రహీంపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎర్దండి గోదావరి తర్వత అంతే పవిత్రమైన గోదావరి తీరం వేములకుర్తి రత్నాలమడుగు. చుట్టూ పచ్చని చెట్లు, గల గల పారే గోదావరి నది, ఆహ్లాదకరమైన వాతావరణం, పర్యాటక ప్రాంతంలా ఉంటుంది. అనునిత్యం చుట్టూ పక్కల గ్రామాల వారే కాకుండా పక్కన ఉన్న జిల్లాల నుంచి కూడా ఇక్కడికి జనం వస్తుంటారు. ప్రతి శుక్రవారం వందల సంఖ్యలో భక్తులు ఇక్కడికి పవిత్ర స్నానాలు చేయడానికి వస్తుంటారు అలాగే. చిన్న పిల్లలకు పుట్టు వెంట్రుకలు, మొక్కులు చెల్లించుకోవడానికి తదితర పూజా కార్యక్రమాలకు నెలవు. వచ్చే భక్తులకు మాత్రం కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వేములకుర్తి గ్రామం నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో గల ఇక్కడికి రావడానికి యామాపూర్ నుంచి ఒక రోడ్డు మార్గం, అలాగే వేములకుర్తి నుంచి ఒక మార్గం ఉంది. ఈ రెండు దారులు పూర్తిగా చెడిపోయి గుంతలమయంగా తయ్యారయ్యాయి. వర్షాకాలం మరింత దారుణంగా ఉంటుంది. 2015లో జరిగిన పుష్కరాల సమయంలో అప్పటి ప్రభుత్వం రూ.38.3 లక్షల నిధులతో పుష్కరఘాట్‌ల నిర్మాణం, నీటి ట్యాంక్‌ల నిర్మాణం, బట్టలు మార్చుకునే గదులు, మంచినీటి కోసం చేతి పంపులు తదితర పనులు చేపట్టారు. వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరూపయోగంగా ఉన్నాయి. ఇటీవల అక్కడి వేములకుర్తి గ్రామభివృద్ధి కమిటీ సహకారంతో తీరంలో గంగామాత ఆలయం నిర్మించారు. వేసవికాలంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకోని రోడ్డు నిర్మాణం చేపట్టి గోదావరి వద్ద సౌకర్యాలు మెరుగుపర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.